ప్రజాశక్తి

ఆదివారం 17 ఆగస్టు 2025 | 5 | అనంతపురం



ధర్మవరంలో ఉలికిపాటు

◆ ఉగ్ర అనుమానంతో వ్యక్తి అరెస్టు

◆ అదుపులోకి తీసుకున్న ఎన్ఐఎ



ఎన్ఐఎ అదుపులోకి తీసుకున్న అనుమానితుడు నూర్ మొహమ్మద్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఉగ్ర కలకలం రేగింది. ధర్మవరంలో ఉన్న ఓ వ్యక్తికి పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధం ఉందని ఆరోపణలతో ఎన్ఐఎ, ఐబి అధికారులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ధర్మవరం పట్టణం లోనికోటకు చెందిన నూర్ మొహమ్మద్ ఓ హోటల్లో పని చేస్తున్నాడు. ఇటీవల ఇతను పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలతో ఫోన్‌లో వాట్సాప్ ద్వారా చాటింగ్ చేసినట్లు సమాచారంతో ఎన్ఐఎ అధికారులు యువకునిపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం ఎన్ఐఎ, ఐబి అధికారులు నూర్ మొహమ్మద్ ఇంట్లో తనిఖీలు నిర్వహించి 16 రకాల సిమ్ కార్డులు లభ్యమైనట్లు సమాచారం. కాగా ఇతన్ని మంగళవారం నాడే అదుపులోకి తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

విచారణ జరుగుతోంది : డీఎస్పీ

ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న నేపథ్యంలో నూర్ మొహమ్మద్‌ను ఎన్ఐఎ అధికారులు అదుపులోకి తీసుకున్నారని, అతనిపై విచారణ కొనసాగుతోందని ధర్మవరం ఇన్‌ఛార్జి డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. నూర్‌మొహమ్మద్ సెల్‌ఫోన్ ద్వారా ఉగ్రవాద సంస్థలతో వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా మాట్లాడుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ మేరకు ఎన్ఐఎ అధికారులు అతన్ని అదుపులోకి తీసుకుకున్నారన్నారు. ఈ విషయంపై విచారణ జరుగుతోందన్నారు.

నాలుగు రోజులుగా మా అన్న కనిపించలేదు..

మా అన్న చాలా మంచివాడని, అతనికి ఉగ్రసంస్థలతో ఎలాంటి సంబంధాలూ లేవని నూర్ మొహమ్మద్ చెల్లెలు తెలిపారు. హోటల్‌లో పని చేస్తున్న తన అన్నని మంగళవారం నాడు కొందరు వారితో పాటు తీసుకెళ్లారని, అప్పటి నుంచి అతని ఫోన్ కూడా పని చేయలేదన్నారు. శనివారం ఉదయం 3 గంటలకు చాలా మంది పోలీసులు తమ ఇంటి వద్దకు వచ్చారన్నారు. మా అన్న కళ్లకు గంతలు కట్టి ఇళ్లంతా సోదాలు చేశారన్నారు. సోదాల అనంతరం మళ్లీ అతన్ని వారి వెంట తీసుకెళ్లారని తెలియజేశారు.

తొలి రోజు గందరగోళం..!

◆ నామమాత్రంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణం

◆ ఏ బస్సులో ఫ్రీ అన్నదానిపై స్పష్టత కరువు



నార్పలలో ఆర్టీసీ బస్ ఎక్కుతున్న మహిళలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

స్త్రీశక్తి ఉచిత బస్సు అమల్లో మొదటి రోజ ఉమ్మడి అనంతపురం జల్లాలో కొంత అయోమయం, గందరగోళం నెలకొంది. ఏ బస్సుకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందో దేనికి వర్తించదో తెలియక మహిళలు ఇబ్బందులు పడ్డారు. అనంతపురం రీజయన్ పరిధిలో అత్యధికంగా ఇంటర్ స్టేట్ రూట్లు ఉన్నాయి. జల్లాకు సరిహద్దున కర్నాటక ఉండటంతో అటువైపు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం సరిహద్దు ప్రాంతాల్లోని వారు కర్నాటకపైనే ఎక్కువ ఆధారపడి ప్రయాణిస్తుంటారు. ఈ బస్సులకు స్త్రీశక్తి పథకం వర్తించదు. దీంతో ఛార్జీలు పెట్టుకునే వెళ్లాల్సి వస్తోంది. అనంతపురం రీజయన్ పరిధిలో మొత్తం 184 రూట్లలో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతుండగా 35 ఇంటర్ స్టేట్ రూట్లు ఉన్నాయి. ఇందులో 26 రూట్లు కర్నాటకలోకి వెళ్తాయి. బెంగళూరు, పావగడ, బళ్లారి, చెళికేర ఉన్నాయి. ఈ ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఉచిత ప్రయాణం లేదు. టిక్కెట్టు తీసుకునే సమయంలో ఒరిజనల్ ఆధార్ కార్డు అడుగుతుండటంతో అది లేని వారు టిక్కెట్టు తీసుకోవాల్సి వస్తోంది.

కళ్యాణదుర్గం టౌన్ : కళ్యాణదుర్గం డిపో పరిధిలో 73 బస్సులు ఉన్నాయి. ఇందులో ఉచిత ప్రయాణం సౌకర్యం ఉన్న బస్సులు 49, ఉచిత బస్సు ప్రయాణం లేని బస్సులు 24. అంతరాష్ట్ర సర్వీసులులలో ఉచిత ప్రయాణ సౌకర్యం లేదు. కళ్యాణదుర్గం నుంచి పరశురాంపురం, హేమావతి, నాగేపల్లి గేటుకు వెళ్లే ఐదు బస్సుల్లో రెండు బస్సులకు ఉచిత ప్రయాణం లేదు. ఉచిత ప్రయాణం బస్సులో టికెట్ జారీ చేసి టిమ్‌లో ఉమెన్ ఫ్రీ టికెట్, డబ్బులు తీసుకునే టికెట్ వివరాలు పక్కపక్కనే ఉండడం కండెక్టర్లను ఇబ్బందికి గురి చేస్తోంది.

ప్రయాణికులు లేక నార్పల స్టాండ్‌లో నిలిచిన ఆటోలు



ఆటోలు స్టాండ్‌కే పరిమితం

నార్పల : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో ఆటోలకు గిరాకీ తగ్గింది. నార్పల మండల కేంద్రం నుంచి ప్రతి గ్రామానికి ఆటోల ద్వారా ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగించేవారు. ఉచిత బస్సులు రావడంతో ప్రయాణికులు బస్సుల్లో వెళ్లేందుకు ఆసక్తి చూపారు. దీంతో ఆటోలన్నీ స్టాండ్లకే పరిమితం అయ్యాయి. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ కుటుంబాల పోషణ ఇబ్బందిగా మారుతుందన్నారు. ఆటోలకు కనీసం కంతులు కూడా కట్టలేమన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. ప్యాసింజర్ ఆటోలు తీసేసి, లగేజ్ ఆటోలుగా మార్చుకోవాల్సి ఉంటుందన్నారు.



యల్లనూరులోని పెట్రోల్ బంకు

పెట్రోల్ బంకులో డీజిల్ ట్యాంకు లీకేజ్

ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని ఎడిసిసి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిందూస్తాన్ పెట్రోల్ బంకులో డీజిల్ ట్యాంకు లికేజీ అవుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెట్రోల్ బంకులో గత నాలుగు నెలల నుంచి రోజూ 200 లీటర్ల వరకూ డీజిల్ తగుతోంది. డీజిల్ తగ్గుదలపై సేల్స్‌మెన్లపై కూడా అధికారులు అనుమానం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఓ పశువుల కాపరి పెట్రోల్ బంకు ప్రహరీ పక్కన వాసన వస్తుండటం గమణించి నిర్వాహకులకు తెలిపాడు. వారు వెళ్లి గమణించగా అసలు విషయం బయటపడింది. ట్యాంకు లీకు కావడం వల్ల డీజిల్ తగ్గుతోందని గమణించారు. చేసేదిలేక మరమ్మతులకు చర్యలు చేపట్టారు.



లికేజ్ అవుతున్న డీజిల్

బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బీడీ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో పి.ఇక్బాల్‌బాషా అధ్యక్షతన ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాలు బీడీలు చుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాయన్నారు. బీడీలు చుట్టడం, కట్టలు కట్టడం, లేబుల్స్ వేయడం వంటి పనులు చేస్తుండటంతో ఆ వాసనకు కార్మికులు క్షయ, వెన్నునొప్పులు, ఇతర జబ్బులకు గురవుతున్నారన్నారు. ఈనేపథ్యంలో వీరికి ఇఎస్ఐ వంటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందుతు ఎదుర్కొంటున్నారు. వీరికి అండగా ఉన్న 1966 బీడీ కార్మికుల చట్టం, 1972 సంక్షేమ చట్టాలను కేంద్రం రద్దు చేయడంతో కార్మికుల ఉపాధికి అభద్రత ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన చట్టాలను పునరుద్ధరించాలని, అంతవరకు జీఎస్టీ వసూళ్ల నుంచి బీడీ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాలని, గుర్తింపు కార్డులు ఇచ్చి ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, ఇఎస్ఐ ఆసుపత్రులు, క్లినిక్‌ల్లో వైద్యులు, సిబ్బందిని నియమించాలని, వృత్తి కోల్పోయిన బీడీ కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం ఉపాధికి ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని, పట్టణాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై బీడీ కార్మికులు ఎక్కువగా ఉన్న జిల్లాలోని కదిరి, తాడిపత్రి ప్రాంతాలతోపాటు కర్నూలు, నెల్లూరు, రాయచోటి, కడప, కాళహస్తి పట్టణాల్లో సెప్టెంబర్ నెలలో ముమ్మర ప్రచారం చేపట్టాలని, అక్టోబర్ నెలలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు తెలియజేసేందుకు సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో అబ్దుల్‌దేశాయ్, సుధాకర్, జివిఎల్ నరసింహులు, జగన్, ఉమగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్ర్య పోరాట యోధుడు గౌతు లచ్చన్నకు గుర్తుగా అనంతపురంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో గౌత లచ్చన్న 116వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎ.మలోల, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారిణి ఖుష్బు కొఠారి, బిసి కార్పొరేషన్ ఈడి సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్ తదితరులు పాల్గొన్నారు. గౌతు లచ్చన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిగా డాక్టర్ సర్దార్ గౌతు లక్షన్న జయంతి ఉత్సవాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. బీసీలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతపురం జిల్లాకేంద్రంలో బీసీల భవనం నిర్మాణం, గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. డిఆర్ఓ మలోల మాట్లాడుతూ భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అన్నారు. సమాజం కోసం ప్రతినిత్యం శ్రమించిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఉద్యోగులు, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు జెవివి జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని గుత్తిలో ఆదివారం నిర్వహించనున్న జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జెవివి నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, తిరుపాల్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గుత్తిలోని పద్మవాణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జరుగుతున్న మహాసభకు మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్, మాజీ రాష్ట్ర అధ్యక్షులు రంగన్న, గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె పద్మ హాజరవుతున్నట్లు తెలిపారు. మహాసభలో జిల్లావ్యాప్తంగా జెవివి అభివృద్ధికి చేసిన కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కర్తవ్యాలను నిర్ణయించుకోనున్నట్లు తెలిపారు. కావున జిల్లా నలమూలల నుంచి జెవివి ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు దిగజారుడుతనం తగదు..

సరసమైన ధరకు నాణ్యమైన మద్యమిచ్చామనడం ఏంటి..-ఆంక్షలు, కోతలతో 'సూపర్ సిక్స్' -వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

ప్రజాశక్తి-అనంతపురం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ప్రసంగంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిగజారి మాట్లాడటం తగదని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరసమైన ధరలకు నాణ్యమైన మద్యం ఇస్తున్నామని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చెప్పడం ద్వారా యువతకు ఏం సందేశం ఇస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తోందని, తొలి ఏడాది పాలనలో సూపర్ సిక్స్ హామీ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రెండో ఏడాదిలో కోతలు, ఆంక్షలు పెట్టి పథకాలు అమలు ప్రారంభించారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం ఇకంద రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు కేంద్రంతో కలిపి రూ.20 వేలు చెప్పడం బాధాకరమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ఇప్పుడు ఆంక్షలు పెట్టడం దారుణమన్నారు. చివరకు తిరుమలకు వెళ్లేందుకు కూడా మహిళలకు అవకాశం లేకుండాపోయిందన్నారు. ఇదంతా ఎవరిని మోసం చేయడానికని ప్రశ్నించారు. ఇకపోతే ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. నిరుద్యోగులకు ప్రతినెలా రూ.3వేల భృతిని ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. 50 ఏళ్లకే పింఛన్ అందిస్తానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. కేవలం ఆర్భాట ప్రచారాల కోసమే చంద్రబాబు పరిమితం అవుతున్నారని మండిపడ్డారు. మరోవైపు శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. ఐఎఎస్, ఐపిఎస్‌లు ప్రజాప్రతినిధుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారని ధ్వజమెత్తారు. 'ఇటీవల అనంతపురంలో విద్యార్థిని తన్మయి హత్య ఇందుకు ఉదాహరణ అన్నారు. సకాలంలో పోలీసులు స్పందించి ఉంటే తన్మయి బతికేదన్నారు. రైతాంగం పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్, జూలై, ఆగస్టు తొలివారం వరకు వర్షాల జాడ లేదన్నారు. ఇలాంటి తరుణంలో ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. ఇక ఎక్కడ చూసినా యూరియా, డీఏపీ కొరత వేధిస్తోందన్నారు. టన్నుల కొద్దీ యూరియా వస్తున్నా రైతులకు అందడం లేదు. బ్లాక్‌లో బస్తాకు అదనంగా రూ.100 చెల్లిస్తే అందిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి అన్ని నియోజకవర్గాల్లోనూ కబ్జాల పర్వం కొనసాగుతోందని ఆరోపించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు దిగజారుడు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



ఎస్సీ కాలనీలో పారుతున్న వర్షం నీరు

చినుకు పడితే చిత్తడే..

బురదమయంగా వేల్పుమడుగు ఎస్సీ కాలనీ-ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-ఉరవకొండ

చినుకు పడితే చాలు విడపనకల్లు మండల పరిధిలోని వేల్పుమడుగు ఎస్సీ కాలనీ బురదమయంగా మారుతోంది. వర్షం నీరు రోడ్లలో నిలబడి నడవలేని స్థితికి చేరుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. వర్షం నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో దోమలు వ్యాపించి అనారోగ్యం పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లలో వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు.



బురదమయంగా ఉన్న ఎస్సీ కాలనీ

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

అనంతపురం కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు రాధాకృష్ణుల వేషధారణలు వేయించి అలరించారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా అనంతపురం సమీపంలోని ఇస్కాన్ టెంపుల్‌లో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. వేలాదిమంది రాధా, చిన్ని కృష్ణులు ఇస్కాన్‌కు వచ్చి తల్లిదండ్రులు సంబరపడ్డారు. మరికొన్ని చోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉట్టి కొట్టిన చిన్నారులకు బహుమతులు అందించారు.



అనంతపురంలోని ఇస్కాన్ ఆలయంలో పూజలందుకున్న రాధాకృష్ణులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ (ఎపిజిఇఎ) సంఘం ప్రధాన లక్ష్యమని సంఘం జిల్లా అధ్యక్షులు గోపీకృష్ణ, ప్రధాన కార్యదర్శి రామునాయక్ వెల్లడించారు. శనివారం ఉదయం స్థానిక జడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న జిల్లా సంఘం కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎపి ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈమధ్యకాలంలో జరిగిన ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో తమ సంఘం ప్రముఖ పాత్ర వహించి వివిధ సేవలు అందించామన్నారు. ఉద్యోగుల హక్కుల సాధనలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అయినప్పటికీ చాలా వరకూ సమస్యలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. సుమారు రూ.35వేల కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. పెన్షనర్ల పరిస్థితి మరింతగా దయనీయంగా మారిందన్నారు. సిపిఎస్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు ఇంతవరకూ పరిష్కారం కాలేదన్నారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టోలో హామీలను అమలు చేయాలన్నారు. ముఖ్యంగా పిఆర్‌సి, డిఎలు, సరెండర్ లీవ్, సిపిఎస్, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, పెన్షనర్లకు పెండింగ్ బకాయిలు, తదితర సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు.. మేరకు జిల్లావ్యాప్తంగా ఉద్యోగుల సమస్యలు తెలుసుకునేందుకు 'రండి.. టీ తాగుతూ సమస్యలపై చర్చించుకుందాం' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు సాంబశివమ్మ, సుజాత, సిటీ యూనిట్ అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, ట్రెజరర్ మౌలాసాబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగరాజు, ఈశ్వరయ్య, శింగనమల తాలూకా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఎపిజిఇఎ నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం ఆధ్వర్యంలో ఐ మిత్ర విజన్ సెంటర్ సౌజన్యంతో నగరంలోని రంగస్వామి నగర్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, ఐ మిత్ర విజన్ సెంటర్ వ్యవస్థాపకాలు పులిపాటి గోపాల్, ఐ మిత్ర విజన్ సెంటర్, కో ఆర్డినేటర్ నాగరాజు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాలు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు ఐ మిత్ర విజన్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మనిషికి కంటి చూపు ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యంతో పాటు కళ్ల సంరక్షణకు ఆకుకూరలు, కూరగాయలు తినాలని, యోగా, వ్యాయామం ఎంతో అవసరమని తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ ఐ మిత్ర విజన్ సెంటర్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రంగస్వామి నగర్ శాఖ కార్యదర్శి రాజు, గఫూర్, జీవా, సిపిఎం నగర కార్యవర్గ సభ్యులు వెంకటనారాయణ, కాలనీ కమిటీ సభ్యులు రాముడు, ముసలప్ప, వీరన్న, పెద్ద బేబీ, దుర్గా, 47 వ డివిజన్ కార్పొరేటర్ రామచంద్ర, వెంకటరాముడు, ముసలప్ప, తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జూనియర్ కళాశాలలో 'వనం-మనం'

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ గత ఐదేళ్లుగా రాయదుర్గం ప్రాంతంలో ప్రజల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మానవ హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం హర్షనీయమన్నారుమీ కార్యక్రమంలో నిర్వాహకులు, సంస్థ రాయలసీమ జోనల్ కన్వీనర్ కావలి ఈశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జోనల్ కార్యవర్గ సభ్యులు సుధామోహన్, తాలూకా ఇన్‌ఛార్జి లక్ష్మన్న, పట్టణ అధ్యక్షులు గోవిందు, ఉపాధ్యక్షులు రుద్ర, గుమ్మగట్ట మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీకాంతరెడ్డి, శివ, ఆనందరెడ్డి, బొమ్మనహాల్ మండల అధ్యక్షులు రాముడు, హీరేహాల్ మండల అధ్యక్షులు మల్లయ్య, కణేకల్ మండల అధ్యక్షులు వెంకటేశులు, ఉపాధ్యాయులు వన్నూరుస్వామి, నీరగంటి శ్రీనివాస్, కళ్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న సిఐ వెంకటరమణ

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.పద్మనాభపిళ్లైకు సన్మానం

ప్రజాశక్తి-గుత్తి

ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.పద్మనాభ పిళ్లైను పలువురు డిఇఇలు, ఎఇఇలు శనివారం ఘనంగా సన్మానించారు. ఎపి దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ గుత్తి డివిజన్ కంపెనీ స్థాయిలో బెస్ట్ ఆపరేషన్ డివిజన్‌గా ఎంపికైంది. ఈ సందర్భంగా శుక్రవారం తిరుపతిలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిఎండి సంతోష్‌రావుతో ఇఇ ఎస్.పద్మనాభ పిళ్లై అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. దీంతో గుత్తి డివిజన్ కార్యాలయంలో పద్మనాభ పిళ్లైను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎస్‌పిడిసిఎల్ డిఇఇలు సాయిశంకర్, నాగేంద్ర, ఎఇఇ కె.మధుసూదన్‌రావు, రామంజులరెడ్డి, ఫోర్‌మెన్ ప్రకాష్, లైన్ ఇన్స్‌పెక్టర్లు కె.నాగేంద్రప్రసాద్, ప్రహ్లాద ఆచారి, షాషావలి, జెఎఇ సత్యానారాయణ, లైన్‌మెన్లు, జెఎల్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభపిళ్లైను సన్మానిస్తున్న డిఇఇలు, ఎఇఇలు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకిసేవ



పల్లకిలో ఊరేగుతున్న స్వామివారు

రాయదుర్గం రూరల్ : శ్రావణమాసం నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామికి పల్లకిసేవ, పూజలు చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామామూర్తి స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం సుప్రభాతసేవ, పంచామృభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్య పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. తర్వాత పట్టణానికి చెందిన నరసింహశెట్టి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి సత్యనారాయణ, నరసింహులు, కార్యదర్శి గురు, అకౌంటెంట్ వెంకటేశులు సభ్యులు కమలాక్షుడు, గురునాథ్‌రెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి ఆనందరెడ్డి, చౌడప్ప, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

'ఊరుచింతల'కు బస్సు సౌకర్యం కల్పించాలి

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని ఊరుచింతల గ్రామానికి స్త్రీ శక్తి పథకం కింద ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఊరుచింతల గ్రామానికి వెళ్లేమార్గంలో అటు ఆలూరు కోన, ఇటు హాజీవలి దర్గా, తలారి చెరువు ఓబులేసు కోన వంటి పుణ్యక్షేత్రాలు ఉన్నాయన్నారు. కావున తాడిపత్రి ఎమ్మెల్యే, ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఊరుచింతల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం

యల్లనూరు : ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని వైసిపి మండల కన్వీనర్ శివశంకర్ విమర్శించారు. శనివారం మండలంలోని గొడ్డుమర్రి, లక్షంపల్లి, సింగివరం, కల్లూరు గ్రామాల్లో 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరాతీస్తూ.. చంద్రబాబు చేస్తున్న మోసాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొడ్డుమర్రి ఈశ్వర్‌రెడ్డి, విష్ణునారాయణ, రామంజనేయులు, లక్షుంపల్లి మల్లారెడ్డి, సింగవరం చంద్రశేఖర్‌నాయుడు, జమాల్, షేక్షావలి, కుళ్లాయప్ప, బాల నరసింహులు, కందిగోపుల సూరి, నాగరంగయ్య, కల్లూరు ప్రతాప్‌రెడ్డి, సూరి, తదితరులు పాల్గొన్నారు.



రీ కాలింగ్ చంద్రబాబు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

బాలుర వసతి గృహానికి భద్రత కరువు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ప్రభుత్వ బాలుర వసతిగృహం-1కు భద్రత కరువైందని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ హరి ప్రసాద్ యాదవ్, సాకే గోవింద ఆరోపించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహం-1ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్లో వార్డెన్ లేరన్నారు. ఫోన్లో వార్డెన్ బాషాను సంప్రదించగా నిర్లక్ష్యం సమాధానం చెప్పారన్నారు. వసతి గృహంలో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారని అటెండెన్స్ చూపించాలని కోరగా వార్డెన్ వీలు కాదని చెప్పారన్నారు. ఉన్న నలుగురు విద్యార్థులు గోడలపైన, రోడ్లలో ఆడుకుంటున్నారని ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని చెప్పారు. హాస్టల్ కు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని చెప్పారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

పోయినేడూ అదేతీరున వాన..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



వాతావరణ మార్పుల ప్రభావం వర్షాలు రాకలో స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాలో గతేడాది లాగా ఈ ఏడాది వర్షాలు తీరుండటం గమనార్హం. ఖరీఫ్ పంటల సాగుకు కీలకమైన జులై నెలలో తీవ్ర వర్షాభావం నెలకొంటూ ఉంది. ఆగస్టులో అధిక వర్షపాతం నమోదయింది. గడిచిన రెండు సంవత్సరాల తీరు ఇదే రకంగా వర్షపాతం నెలకొంది. పోయిన సంవత్సరం కూడా జన్‌లో మంచి వర్షాలు పడినప్పటికీ జులై నెలలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఈ ఏడాది మేలో మంచి వర్షపాతం పడింది. జూన్, జులై నెలలో తీవ్ర వర్షాభావం కొనసాగింది. ఆగస్టులో అధిక వర్షపాతం నమోదయింది. 2024-25 సంవత్సరంలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61.7 అయితే 147.7 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 142 శాతం అధికంగా పడింది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 63.9 మిల్లీమీటర్లు అయితే 24.4 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణంలో 61 శాతం లోటు పడింది. ఆగస్టు నెలలో సాధారణం 83 మిల్లీమీటర్లు అయితే 210 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 151 శాతం అధికంగా వర్షపాతం పడింది. ఈ సంవత్సరం చూస్తే జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61.7 మిల్లీమీటర్లకుగానూ 47.9 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 21.7 శాతం లోటు పడింది. జులై నెలలో 64.3 మిల్లీమీటర్లకుగానూ 34.7 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 46 శాతం లోటు పడింది. ఆగస్టు ఇప్పటి వరకు 39 మిల్లీమీటర్లు పడాల్సి ఉంటే 140.8 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 282 అధికంగా వర్షపాతం పడింది. సీజన్ మొత్తం సాధారణ వర్షపాతం పడినట్టు కనిపించినా నెలల వారీగా చూసినప్పుడు పెద్ద వ్యత్యాసముంది. ప్రభుత్వం కరువు మండలాల ప్రకటన చేసే సమయంలో సీజన్‌ను పరిగణలోకి తీసుకుని ప్రకటిస్తోంది. దీంతో వర్షాభావంతో నష్టపోతున్న రైతులకు పరిహారం సక్రమంగా అందటం లేదు గతేడాది ఇదే రకంగా జరిగింది. కరువు మండలాల ప్రకటన సరిగా లేదని అధికార పార్టీ నేతలే పలు సమావేశాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనల్లోనున్న లోపం కారణంగానే ఈ నష్టం జరుగుతోందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ వారంలో స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీని అమలు శనివారం నుంచే ఆరంభమైంది. అయితే ఆచరణలో కొన్ని ఇక్కట్లు ఉన్నాయి. ఏ రూటులో, ఏ బస్సులో ఉచిత బస్సు ప్రయాణం అమలు జరుగుతుందో తెలియక అయోమయం పడుతున్నారు. ప్రధానంగా అనంతపురం జిల్లాకు సరిహద్దున కర్నాటక ఉండటంతో ఇంటర్ స్టేట్ సర్వీసులు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు సమస్య వస్తోంది. ఇక రాజకీయంగా చూసినప్పుడు సిపిఎం సత్యసాయి జిల్లా మహా సభలు జరిగాయి. సిపిఐకు సంబంధించి అనంతపురం జిల్లా మహాసభలు ఈ వారంలో జరిగాయి. అనంతపురం అర్బన్ టిడిపిలో ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్, మాజ ఎమ్మెల్యే వై.ప్రభాకర్ చౌదరి మధ్య మాటల యుద్ధం రచ్చకెక్కింది. పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం చర్చనీయాంశమైంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కుమారుడు ప్రణయ్ రెడ్డి వివాహానికి హాజరయ్యేందుకు అనంతపురం విచ్చేశారు.

భక్తులతో పోటెత్తిన అంజన్న ఆలయం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

శ్రావణమాసం ఆఖరి శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా స్వామివారికి వెండి కవచం, సువర్ణ కిరీటం అలంకరించి తమలపాకల పూజ, కుంకుమ, పుష్పాలంకరణలు, హోమాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ తగ్గలేదని ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌స్వామి తెలిపారు. ఈమేరకు భక్తులకో పార్కింగ్‌తోపాటు ఆలయంలో సకల సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ ప్రధాన అధికారి నర్సింహారెడ్డి తెలిపారు. భక్తులకు ఉచిత అన్న ప్రసాదం ఏర్పాటు చేసినటుల అన్నదాన కమిటీ అధ్యక్షులు పూజారి తిప్పేస్వామి వివరించారు.

స్వామివారికి వెండి వితరణ

మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామికి జమేదారు నరేంద్ర కుటుంబ సభ్యులు వెండిని వితరణ చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో జమేదార్‌గా విధులు నిర్వహిస్తున్న నరేంద్ర మొక్కుబడి మేరకు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి వెండి కిరీటాలు వితరణ చేసినట్లు ఆలయ అర్చకులు అనిల్ స్వామి తెలిపారు.



పూజలు చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

విప్ కాలవ ప్రత్యేక పూజలు

రాయదుర్గం : శ్రావణ మాసం నాలుగో శనివారం సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మురడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. కాలవ శీనన్నకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా బళ్ళారి గాదిలింగప్ప ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న త్యాగం మరువలేనిది

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

ప్రజాశక్తి-గుంతకల్లు

దేశ స్వాతంత్ర్య కోసం పోరాటం చేసి అశువులు బాసిన సర్దార్ గౌతు లచ్చన్న త్యాగం మరువలేనిదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ కొనియాడారు. శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని జితేంద్రగౌడ్ క్యాంపు కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య కోసం పోరాటం చేయడమే కాకుండా రైతుసంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో ఎన్నో ఉద్యమాలు నడిపిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అలాంటి గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కౌన్సిలర్ రామగౌని, పవన్‌కుమార్‌గౌడ్, యువ నాయకుడు అనిల్‌గౌడ్, విశ్రాంత తహశీల్దార్ ఇఒ రాముడు, గౌడ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు గౌడ్, చలపతి, రవిశంకర్ గౌడ్, శ్రీరాములు గౌడ్, నారాయణస్వామి, ఆంజనేయులు గౌడ్, సుధాకర్ గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు టీ.కేశప్ప,తెలుగు మహిళా నాయకురాలు బండి లక్ష్మిదేవి, జయమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

జాతీయ పతాకం అవనతంపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని ముట్టాల గ్రామ పంచాయతీ సచివాలయ అధికారులు జాతీయ పతాకం అవతనంపై నిర్లక్ష్యం చేయడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవాని పురస్కరించుకుని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే మండల పరిధిలోని ముట్టాల సచివాలయం వద్ద అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అయితే సాయంత్రం పతాకాన్ని అవతనం చేయడం మాత్రం మరిచారు. మామూలుగా అదేరోజు సాయంత్రానికి జాతీయ పతాకాన్ని అవతనం చేయాలి. అయితే సచివాలయ అధికారులు మరిచిపోవడంతో జాతీయ పతాకం ఎగురుతూనే ఉంది. దీన్ని చూసిన స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జాతీయ పతాకాన్ని అవతనం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శనివారం కూడా ఎగురుతున్న జాతీయ పతాకం

కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

శ్రీకృష్ణుడి బోధనలు విశ్వమంతటికీ అనుసరణీయమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శనివారం నగరంలోని అరవింద్‌నగర్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజలకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణుడి అవతారం ఎంతో మహోన్నతమైనదని.. అందులో నుంచి స్ఫూర్తి పొందే అంశాలు చాలా ఉన్నాయన్నారు. భక్తి, ప్రేమ, శాంతి, సత్యం, సహనం వంటి విలువలను పెంపొందించుకోవాలన్నారు. భగవద్గీతలో కృష్ణుడు బోధించిన మార్గంలో ధర్మం, కర్మ, జ్ఞానం, భక్తి ఉన్నాయన్నారు.

ఇవి జీవితాన్ని మెరుగుపరచడానికి, జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యలకు పరిష్కారాలను సూచిస్తాయన్నారు. ఆయన బోధనలు కేవలం మతపరమైనవి మాత్రమే కాకుండా, నైతికత, సామాజిక, వ్యక్తిగత జీవితానికి కూడా మార్గదర్శకాలుగా ఉంటాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మల్లికార్జున, ఇందిరమ్మ, చంద్రకళ, చంద్రశేఖర్, జయప్రకాష్, జస్వంత్ వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉప్పర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ

ఎమ్మెల్యే దగ్గుపాటిని కలిసిన కార్పొరేషన్ల ఛైర్మన్లు

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర సగర, ఉప్పర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎన్నికైన వెంకటరమణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన ఆంజనేయులు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించి సత్కరించారు. ప్రభుత్వానికి, పార్టీకి మంచి పేరు వచ్చేలా పని చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

కల్తీ కల్లు దుకాణాల సీజ్‌కు డిమాండ్

రాయదుర్గం : రాయదుర్గంలో వెలసిన కల్తీ కల్లు దుకాణాలను వెంటనే సీజ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గౌని ప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాయదుర్గంలో తయారు చేస్తున్న కల్తీకల్లు తయారు చేస్తున్నట్లు కర్ణాటక అసెంబ్లీలో అక్కడ ఎమ్మెల్యే ప్రస్తావించడం ఆందోళన కలిగించే విషయమన్నారు. రాయదుర్గం నియోజకవర్గం నుంచి కల్తీకల్లు కర్ణాటకకు సరఫరా అవుతుండడంతో యువకులు మృతిచెందిన విషయాన్ని సండూర్ ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించడం చూస్తుంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. కావున వెంటనే కల్తీ కల్లు దుకాణాలను పూర్తిగా రద్దు చేయించేలా చూడాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ గోడౌన్ చుట్టూ ముళ్లకంప



ముళ్ల కంపతో నిండి ఉన్న వ్యవసాయ గోడౌన్

యల్లనూరు : మండల కేంద్రంలోని వ్యవసాయ గోడౌన్ చుట్టూ ముళ్లకంప పేరుకుపోయింది. ఎస్‌డిపి నిధుల కింద దాదాపు రూ.24.65లక్షలతో వ్యవసాయ గోడౌన్‌ను నిర్మించారు. గోడౌన్‌ను నిర్మించారు తప్ప.. వినియోగించుకోలేక నిరుపయోగంగా మారింది. గత వైసిపి ప్రభుత్వంలో రెవెన్యూ గ్రామాల ఆధారంగా మండలంలోని 21 పంచాయతీలకు 14 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. అప్పటి నుంచి వ్యవసాయ గోడౌన్ నిరుపయోగంగా మారి పక్షులకు నిలయమైంది. వినియోగంలో లేకపోవంతో గోడౌన్ చుట్టూ ముళ్ల కంపలతో నిండిపోయింది. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి గోడౌన్ చుట్టూ ముళ్లకంప తొలగించడంతోపాటు వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



సంజీవ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాజీ సైనిక సంఘం నాయకులు

మాజీ సైనికుడు సంజీవ్‌కుమార్‌కు సన్మానం

అనంతపురం సిటీ : విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మాజీ సైనికుల తరుపున పాల్గొన్న మాజీ సైనికుడు సార్జెంట్ సంజీవ్‌కుమార్‌ను శనివారం అనంతపురంలోని మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ దూదేకుల షేకన్న, సంఘ ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ టి.తిమ్మారెడ్డి, బండి వెంకటరమణ, రంగారెడ్డి, బిఎ హుస్సేన్, వై.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

21న ఎపిఎన్‌జిఒ నూతన భవనం ప్రారంభం

కళ్యాణదుర్గం టౌన్ : బళ్లారి రోడ్డులోని డీఎస్పీ కార్యాలయం పక్కన రూ.56 లక్షలతో నిర్మించిన ఎపిఎన్‌జిఒ నూతన భవనాన్ని ఈనెల 21వతేదీన ప్రారంభించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిక్కుల మాధవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రారంభోత్సవానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, ఇతర జిల్లాలకు చెందిన నాయకులు, కార్యవర్గ సభ్యులు హాజరవుతున్నట్లు తెలిపారు.

పాతపల్లిలో కార్డెన్‌సెర్చ్



ప్రజలతో మాట్లాడుతున్న సిఐ సత్యబాబు

యల్లనూరు : ఎస్పీ జగదీశ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామం పాతపల్లిలో పుట్లూరు రూరల్ సిఐ సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి, సిబ్బందితో కలిసి శనివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రానున్న వినాయక చవితి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలన్నారు. అలాగే వినాయక చవితి విగ్రహ మండపాలకు అనుమతి తీసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో విగ్రహ మండపానికి చెందిన దరఖాస్తు పూరించి సబ్ ఇన్స్‌పెక్టర్‌కు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైని ఎస్ఐలు పుట్లూరు, యల్లనూరు పోలీసులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట స్థావరాలపై దాడులు

ఏడుగురి అరెస్టు..

తాడిపత్రి రూరల్ : పక్కాగా అందిన సమాచారం మేరకు తాడిపత్రి అడిషనల్ ఎస్పీ రోహిత్ చౌదరి ఆదేశాల మేరకు సిబ్బందితో వెళ్లి శనివారం పేకాట స్థావరాలపై దాడులు చేసినట్లు తాడిపత్రి రూరల్ అప్‌డేట్ పోలీస్ స్టేషన్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏరఆపటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పెన్నానది ఒడ్డున చుక్కలూరుకు వెళ్లే మార్గంలో వంతెన కింద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.1,02,000 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిఐతో పాటు రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సిఐ శివగంగాధర్‌రెడ్డి

గంజాయి విక్రయిదారుల అరెస్టు

ఒడిస్సా రాష్ట్రం నుంచి తాడిపత్రికి గంజాయి సరఫరా చేస్తే వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో రూరల్ పరిధిలోని పారిశ్రామికవాడ వద్ద చుక్కలూరుకు వెళ్లే దారిలో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఇద్దరు రావడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 610 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు అయిన వారిలో నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన శేషాద్రి, మరోవ్యక్తి ఉన్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.



పోలీసుల అదుపులో ఉన్న గంజాయి విక్రేత

దుకాణంలో చోరీ

పుట్లూరు : మండల కేంద్రంలోని ఓ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకు పాల్పడ్డారు. మండల కేంద్రానికి చెందిన బాలాపురం నారాయణస్వామి కిరాణా దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగానే మామూలుగానే శుక్రవారం రాత్రి దుకాణానికి తాళం వేసి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి దుకాణం తెరిచి క్యాష్ కౌంటర్ వద్దకు వెళ్లి చూడగా రూ.15వేలు చోరీకి గురైనట్లు గమణించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే పోలీసులు వేలిముద్ర నిపుణులు రప్పించి పరిశీలించారు.



చోరీపై విచారిస్తున్న పోలీసులు

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

గుమ్మగట్ట : మండల పరిధిలోని వీరాపురం గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం తళుకు గ్రామానికి చెందిన విజయకుమార్ గ్రామం నుంచి గుమ్మగట్ట మండలం వీరాపురానికి బంధువుల ఇంటికి వస్తుండగా.. బ్రహ్మసముద్రం మండలం బైరసముద్రం గ్రామానికి చెందిన లింగన్న మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై ఆగి ఉన్న విజయ్‌కుమార్‌ను ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108 సాయంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.